క్లుప్తంగా

ధర్మశ్రీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి తరలిరావాలి

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు పరిశీలకునిగా నూతనంగా నియమితులైన చోడవరం మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఈ నెల 31న కశింకోట సరోజిని గార్డెన్‌లో జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో పాటు, సర్పంచ్‌లు, వివిధ కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు, పాలసొసైటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు. బాధ్యతలు స్వీకరణ కార్యక్రమంతో పాటు పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు.

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు

గొలుగొండ: రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని బీజేపీ రాష్ట్ర కన్వీనర్ గాదె శ్రీనివాసరావు అన్నారు. సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయులకు నివాళులర్పిస్తున్నట్టు చెప్పారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



పనులు చేస్తున్న కార్మికులు

గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురంలో ముమ్మరంగా పారుశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. సర్పంచ్ లోచల సుజాత, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో కాలువల్లో పేరుకుపోయిన చెత్త తొలగిస్తున్నారు. పారుశుధ్య పనులతో పాటు, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ సుజాత తెలిపారు.

కల్లు గీత కులాలకు మూడు మద్యం షాపులు

మాడుగుల రూరల్: మాడుగుల ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్లు గీత కులాలకు మూడు మద్యం షాపులు కేటాయించినట్టు మాడుగుల ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ సీహెచ్.వి.ఎస్. ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాడుగుల మండలంలో శెట్టి బలిజ, చీడికాడ మండలంలో శెట్టి బలిజ, రావికమతం మండలంలో యాత కులానికి ఈ షాపులు కేటాయించినట్టు పేర్కొన్నారు. ఈ షాపులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు స్థానికులైన కల్లు గీత కుటుంబాలకు చెందినవారై ఉండాలని తెలిపారు. రూ. రెండు లక్షల చలానాతో పాటు కుల, నివాస, ధ్రువీకరణపత్రాలు జతపరిచి మాడుగుల ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో వచ్చే నెల 5 వ తేదీ లోపు దరఖాస్తులు సమర్పించాలని సీఐ తెలిపారు.

విద్యుత్ శాఖ ఏఈకి అభినందన



బాలకృష్ణను అభినందిస్తున్న నాయకులు

మాకవరపాలెం: ఉత్తమఅధికారిగా అవార్డు అందుకున్న విద్యుత్‌శాఖ ఏఈ బాలకృష్ణకు వైఎస్సార్‌సీపీ నేతలు అభినందనలు తెలిపారు. మండలంలో విద్యుత్ సమస్యలపై తక్షణం స్పందిస్తూ, బెస్ట్ ఆపరేషన్ సెక్షన్ కేటగిరీలో బాలకృష్ణ గణతంత్ర దినోత్సవం రోజున ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు చిటికెల రమణ, పోతల వెంకునాయుడు, నాయకులు రుత్తల రాజు, లోవరాజు తదితరులు బాలకృష్ణను అభినందించారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ సత్యం మృతి



కె.కోటపాడు : మండలంలో మేడిచర్ల గ్రామానికి చెందిన గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ వేచలపు సత్యం(81) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందారు. విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్‌గా వేచలపు సత్యం మూడు సార్లు ఎన్నికయ్యారు. సత్యం మృతదేహం వద్ద బుధవారం పలువురు నివాళులు అర్పించారు.



రేకులు సరిగా లేక వర్షానికి ఆలయంలో కురుస్తున్న నీరు



అసంపూర్తిగా నిలిచిపోయిన కల్యాణ మండప నిర్మాణం



ఆలయం చుట్టూ సక్రమంగా ఏర్పాటు చేయని రేకులు



ఆలయంలోకి వెళ్లే దారిలో ఎత్తుగా ఉన్న మెట్లు

ఆధ్యాత్మిక ధామం.. అభివృద్ధికి దూరం

భక్తులను అవ్యక్తానుభూతులకులోను చేసే దివ్యక్షేత్రం వద్దాది వేంకటేశ్వరస్వామి ఆలయం. ఈ దివ్యధామం అభివృద్ధిపై నీలినీడలు అలుముకున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆలయంలో సమస్యలు పరిష్కరించకపోవడంతో భక్తులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఘనమైన చరిత్రగల ఆలయంపై అధికారులు, నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.

- వద్దాది వెంకన్న ఆలయం అభివృద్ధిపై నీలినీడలు
- మధ్యలోనే ఆగిపోయిన కల్యాణ మండప నిర్మాణం
- ఆలయం చుట్టూ వేసిన రేకులు సరిగా లేక ఇబ్బందులు
- ఎత్తైన మెట్లు ఎక్కలేక అవస్థలు
- దర్శనం చేసుకోకుండానే వెనుదిరుగుతున్న వృద్ధులు,దివ్యాంగులు
- ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతున్న భక్తులు



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



వద్దాది వేంకటేశ్వరస్వామి ఆలయం

బుచ్చెయ్యపేట : మండలంలోని వద్దాదిలో గిరిజాంబ కొండపై వేంకటేశ్వరస్వామి ఆలయం ఆధ్యాత్మిక ధామంగా శోభిల్లుతోంది. కోరిన కోర్కెలు తీర్చే వేలుపుగా పేరొందడంతో తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడికి వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ప్రతి సంవత్సరం మార్చిలో ఐదు రోజుల పాటు జరిగే కల్యాణ మహోత్సవాలకు ఏటా లక్షలాది మంది భక్తులు తరలి సార్తు. వద్దాది పరిసర ప్రాంత ప్రజలు వేంకటేశ్వరస్వామి ఆలయంలో వివాహాలు జరిపిస్తారు.

ఆస్తులు..ఆదాయం ఉన్నా...

స్వామి వారికి సుమారు 58 ఎకరాల భూమితో పాటు బంగారు,వెండి ఆభరణాలు, ఆస్తులున్నాయి. ఏటా ఉత్సవాల సమయంలో సుమారు రూ.10 లక్షల వరకూ ఆదాయం వస్తోంది. దేవస్థానం భూములను కౌలుకు ఇవ్వడం వల్ల కూడా ఆదాయం లభిస్తోంది. ఇంతటి ప్రాముఖ్యత గల ఈ ఆలయం అభివృద్ధిపై దేవదాయశాఖ అధికారులు, నాయకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

అసంపూర్తిగా కల్యాణ మండపం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కల్యాణ మండపం నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి కామన్ గుడ్ ఫండ్ రూ.30 లక్షలు మంజూరు చేయించారు. కొండపైనే ప్రధాన ఆలయం పక్కనే కల్యాణ మండపం నిర్మాణ పనులు చేపట్టారు. శ్లాబ్ స్థాయి వరకు పనులు చేసి అసంపూర్తిగా విడిచిపెట్టారు. భక్తుల విరాళాలతో ఆలయం చుట్టూ వేసిన రేకులు సక్రమంగా లేక వర్షం కురిస్తే నీరు లీకై ఆలయ పరిసర ప్రాంతం తడిసి చిత్తడిగా మారుతోంది. కొండపైన ఆలయంలోకి వెళ్లే మెట్లు ఎత్తుగా ఉండడంతో వృద్ధులు,దివ్యాంగులు మెట్లు ఎక్కలేక వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. చాలా మంది దర్శనం చేసుకోకుండానే వెనుదిరుగుతున్నారు.

వద్దాదిలో నాయకుల మధ్య సయోధ్య లేకపోవడంతోనే వేంకటేశ్వరస్వామి ఆలయం అభివృద్ధి చెందడం లేదని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. వేంకటేశ్వరస్వామికి పలు బంగారు,వెండి ఆభరణాలున్నాయి. అయితే ఉత్సవాల సమయంలో కూడా శ్రీదేవి,భూదేవి,వేంకటేశ్వరస్వామికి ఆభరణాలు అలంకరించకపోడంతో భక్తులు విస్మయం చెందుతున్నారు. మరో నెల రోజుల్లో వద్దాది వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికైనా నాయకులు, ఆలయ అధికారులు సమష్టిగా ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని, ఏలోటు లేకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

కల్యాణమండపం నిర్మాణం పూర్తి చేయాలి

నేను 40 ఏళ్లుగా వద్దాది వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్నాను. స్వామిని నమ్ముకోవడం వల్ల కోరిన కోర్కెలు తీరాయి. స్వామి సన్నిధిలో వివాహాలు జరిపించుకోవడానికి కల్యాణ మండపం నిర్మాణం పూర్తి చేయాలి. కొండపైన ఆలయం వద్ద ఉన్న మెట్లు ఎత్తు తగ్గించి వృద్ధులు సులువుగా దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలి.

– ఒడ్డి భూలోకమ్మ,పొట్టిదొరపాలెం.

అభివృద్ధిపై దృష్టిసారించాలి

150 ఏళ్ల చరిత్ర ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా నాయకులంతా కలిసి కృషి చేయాలి. మహిమ గల వేంకటేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలకు ఇతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. ఇంత ప్రాముఖ్యత గల దేవాలయం అభివృద్ధిపై అధికారులు,నాయకులు దృష్టిసారించాలి. గతంలో నాయకులు వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీలిచ్చినా అమలు కాలేదు.

– సుంకరి వరహాలబాబు,బుచ్చెయ్యపేట.

పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం

వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మండపం నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే కల్యాణ మండపం పనులు పూర్తి అయ్యేలా చూస్తాం. ఈ ఏడాది జరిగే ఉత్సవాలకు ముందే మెట్ల ఎత్తును తగ్గించి, వృద్ధులు దర్శనానికి వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.

– శర్మ,దేవస్థానం ఈవో.

రోడ్డు పక్కన ఉన్న వాహనాలను తొలగించాలి



మర్యాద పూర్వకంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడిని కలిసిన డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం: ఎక్సైజ్ స్టేషన్ ప్రాంతంలోని మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న వాహనాలను తొలగించాలని డీఎస్పీ శ్రీనివాసరావును స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ బుధవారం మర్యాద పూర్వకంగా స్పీకర్‌ను కలిశారు. ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను రోడ్డుకు అటు ఇటు పెట్టడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నందున వాహనాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్పీకర్ ఆదేశించారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని, పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీని ఆదేశించారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నర్సీపట్నం: అంబేడ్కర్ ఆశయసాధనకు ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ సీనియర్ నాయకులు గాదె శ్రీనివాసరావు, కాళ్ల సుబ్బారావు, అడిగర్ల సతీష్ తెలిపారు. సంవిధాన్ గౌరవ దివాస్ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ బలిఘట్టం దళిత వాడలో బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ పని చేస్తున్నారని చెప్పారు.

పాఠశాలల స్థాయి పెంపునకు ప్రతిపాదన

మాకవరపాలెం: మండలంలో రెండు పాఠశాలల స్థాయి పెంపునకు ప్రతిపాదనలు పంపినట్టు ఎంఈవో జాన్‌ప్రసాద్ బుధవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో 60 మందికిపైగా విద్యార్థులు ఉన్న జంగాపల్లి, జి.వెంకటాపురం ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. మాకవరపాలెం, జి.కోడూరు, వజ్రగడ, తూటిపాల, పాపయ్యపాలెం, గిడుతూరు ప్రాథమిక పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఎంపిక చేసేందుకు ప్రతిపాదించామన్నారు.

రికార్డుల నిర్వహణ బాధ్యత హెచ్ఎంలదే



రికార్డులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగ శిరీషా

నాతవరం: పాఠశాలల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండేలా ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలని మండల ప్రత్యేకాధికారి నాగశిరీషా అన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు రాసిన నోట్ పుస్తకాలను తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రధాన సమస్యలను హెచ్‌ఎం టి.లోవకుమారిని అడిగి తెలుసుకున్నారు.

145 పాడిపశువులకు వైద్యసేవలు

చోడవరం రూరల్: మండలంలోని గౌరీపట్నం గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో 145 పాడి పశువులకు వైద్యసేవలందించారు. గవరవరం పశువైద్యాధికారి ఎ.అచ్యుతరామ్ నేతృత్వంలో నిర్వహించిన శిబిరాన్ని గ్రామ సర్పంచ్ చంద్రరావు ప్రారంభించారు.గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

పారా లీగల్ వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మాడుగుల రూరల్: ప్రజలకు న్యాయపరమైన ఉచిత సహాయం అందించేందుకు పారా లీగల్ వలంటీర్లుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు, జడ్జి జి.స్వర్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు ఈ నెల 31 వ తేదీలోగా మాడుగుల కోర్టులో గల న్యాయ సేవా అధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత వివరాలు, ఆధార్ కార్డు, రెండు పాసు ఫొటోలు జత చేయాలని తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థల్లో పనిచేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఏడాది పాటు పారా లీగల్ వలంటీర్లుగా ఉచిత సేవలు అందించాలన్నారు.

విద్యార్థులకు చేయూత

నర్సీపట్నం: వైద్య, ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న ఇద్దరు విద్యార్థినులకు ఎన్నారై వాసవీ అసోసియేషన్ సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. ఎంబీబీఎస్ చదువుతున్న పెనుగొండ మహాశ్వేతకు రూ.75 వేలు, బీటెక్ దంగేటి శర్వాణికి రూ.76,500 నగదును డీఎస్పీ శ్రీనివాసరావు చేతుల మీదగా బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ వాసవీ అసోసియేషన్ ప్రతినిధి, ఆర్యవైశ్య మహాసభ స్టేట్ బోర్డు మెంబర్, వాసవీక్లబ్ రీజినల్ చైర్మన్ వెలగా నారాయణరావు, ఆర్యవైశ్య మహాసభ స్టేట్ సెక్రటరీ సుతాపల్లి శ్రావణ్, వాసవీక్లబ్ ప్రెసిడెంట్ నాళం రమేష్‌కుమార్, కళావతి, కేదారిశెట్టి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీకి భూముల వివరాలు అందించాలి

కె.కోటపాడు : త్వరలో అందుబాటులోనికి రానున్న ఫార్మర్ రిజిస్ట్రీలో వ్యక్తిగత, పట్టా భూమి వివరాలను నమోదు చేసే కార్యక్రమానికి రైతులు సహకరించాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. మండలంలో దాలివలస గ్రామంలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం వ్యవసాయ, రెవెన్యూశాఖల సిబ్బంది సంయుక్తంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమం పూర్తయిన రైతులకు 14 సంఖ్యలు గల గుర్తింపు కార్డును అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, ఏఈవోలు లైలాదేవి, ప్రియాంక, సర్పంచ్ భూమిరెడ్డి దేముళ్లు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌క్లబ్ స్టీల్ బ్యాంక్ ఏర్పాటు

నర్సీపట్నం: ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర వాకర్స్‌క్లబ్ స్టీల్ బ్యాంక్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా వాకర్స్‌క్లబ్ సభ్యులు స్టీల్ ప్లేట్లను వాడాలని నిర్ణయం తీసుకోవటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ కామిరెడ్డి సత్యనారాయణ, ట్రెజరర్ అల్లు అప్పారావు, ఉపాధ్యక్షులు కుప్పిలి స్వామి, ఎం.వి.రంగారావు, జాయింట్ సెక్రటరీ పిట్ల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ తీర్థం

కె.కోటపాడు : రొంగలినాయుడుపాలెంలో బుధవారం మరిడిమాంబ అమ్మవారి తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. తీర్థం సందర్భంగా మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలను నిర్వహించారు. మొదటి 10 స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. అమ్మవారి ఆలయంలో గ్రామ సర్పంచ్ పైల పైడితల్లమ్మ, కోటేశ్వరరావు, ఎంపీటీసీ గొర్రుపోటు రామలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు యడ్ల వెంకటరావు పూజలు జరిపారు.

వాడీవేడిగా బడ్జెట్ సమావేశం



అధికార, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి



టీడీపీ కౌన్సిలర్ మధుని నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం

- నర్సీపట్నం మున్సిపాలిటీ అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం
- వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు వాకౌట్

నర్సీపట్నం: మున్సిపల్ బడ్జెట్ సమావేశం వాడీవేడిగా సాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన బుధవారం బడ్జెట్ సమావేశం జరిగింది. సాధారణ ఎజెండాలోని పలు అంశాలపై మున్సిపల్ వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు అధికారులను నిలదీశారు. కమిషనర్ సురేంద్ర సమాధానం చెప్పేందుకు ప్రయత్నించారు. సంబంధిత శాఖల అధికారులు సమాధానం చెప్పాలని వైస్‌చైర్మన్లు డిమాండ్ చేశారు. టీడీపీ కౌన్సిలర్లు సీహెచ్.పద్మావతి, ధనిమిరెడ్డి మధు అధికారులకు వత్తాసు పలకడంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గత ఐదేళ్ల కాలంలో మున్సిపాలిటీ అభివృద్ధిని పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కాలంలో మున్సిపాలిటీ అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ నుంచి స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూ.4.50 కోట్లు నిధులు తీసుకువచ్చారని టీడీపీ కౌన్సిలర్ పద్మావతి అన్నారు. గత ఐదేళ్ల కాలంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఏం చేశారన్నది వార్డుల్లో ప్రజలకు తెలుసునని వైస్‌చైర్మన్ రామకృష్ణ టీడీపీ కౌన్సిలర్ పద్మావతి విమర్శలను తిప్పికొట్టారు. వైఎస్సార్‌సీపీకి ప్రజలు అధికారం ఇచ్చింది ఐదేళ్లేనని, స్పీకర్ అయ్యన్నపాత్రుడు కుటుంబానికి ప్రజలు 40 ఏళ్లు అధికారం ఇస్తే అభివృద్ధిని గాలికి వదిలేసి, ఐదేళ్లలో తాము ఏమి చేయలేదని మాట్లాడటం సరికాదని వైస్‌చైర్మన్ రామకృష్ణ టీడీపీ కౌన్సిలర్లకు కౌంటర్ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ చొరవ తీసుకుని 20వ వార్డులోని గిరిజన గ్రామమైన లింగాపురానికి రూ.10 లక్షలతో అప్రోచ్ రోడ్డు సౌకర్యం కల్పిస్తే, టీడీపీ కౌన్సిలర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ రోడ్డుకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపారని వైస్‌చైర్మన్ రామకృష్ణ పేర్కొన్నారు. టీడీపీ కౌన్సిలర్ సిహెచ్.రాజేష్ కల్పించుకుని ఎస్టీ గ్రాంటు వచ్చినప్పుడు పెడదామని, ప్రస్తుత గ్రాంటులో నిధులు కేటాయించలేదని దీనిని రాజకీయం చేయటం సరికాదన్నారు. సిబిల్లు ద్వారా రూ.16.22 లక్షలు డ్రా చేయడంపై వైస్‌చైర్మన్ రామకృష్ణ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ సమాధానం చెప్పాలని వైస్‌చైర్మన్లు డిమాండ్ చేశారు. కమిషనర్ సమాధానం చెబుతుండగా వైస్‌చైర్మన్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం దోచుకునే ఉద్దేశంతోనే సిబిల్లు పెట్టారని ఆరోపించారు. భోజనం చేసి వెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కాలయాపన చేస్తున్నారని టీడీపీ కౌన్సిలర్ మధు అనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు తీరుపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మధు క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.మధు వ్యవహారశైలిపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. టీడీపీ కౌన్సిలర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సభ జరుగుతుండగానే వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు వాకౌట్ చేశారు.

బడ్జెట్‌కు ఆమోదం

ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పురపాలక బడ్జెట్‌ను కమిషనర్ సురేంద్ర బుధవారం కౌన్సిల్‌లో ప్రవేశపెట్టారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ. 36.88 కోట్లు బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వాస్తవ బడ్జెట్ రూ.33.30 కోట్లు కాగా, ప్రారంభ నిల్వ రూ.3.58 కోట్లు చూపించారు. వ్యయం రూ.34.36 కోట్లుగా అంచనా వేశారు. దీంతో రాబోయే ఆర్థిక సంవత్సరంలో రూ.2.52 కోట్లు మిగులు చూపించారు.

ధర్మశ్రీ ప్రమాణ స్వీకారానికి తరలి రండి

మాడుగుల: అనకాపల్లి జిల్లా కశింకోట సరోజిని గార్డెన్స్‌లో ఈ నెల 31వ తేదీన వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జిగా ధర్మశ్రీ ప్రమాణ స్వీకారం చేయనున్నారని, ఆ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్ కోరారు.మండలంలోని 29 పంచాయతీల నుంచి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలన్నారు.

చీడికాడ: ధర్మశ్రీ ప్రమాద స్వీకారోత్సవానికి తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు పిలుపునిచ్చారు. ఉదయం 9గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి సర్పంచ్‌లు,ఎంపీటీసీలతో పాటు ముఖ్య కార్యకర్తలు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఐయితంపూడిలో జగనన్న లే అవుట్ ఆక్రమణ

బుచ్చెయ్యపేట: మండలంలోని ఐయితంపూడిలో జగనన్న లే అవుట్‌కి కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామానికి కొంత దూరంలో సర్వే నంబర్ 100–1లో 71 సెంట్ల స్థలాన్ని జగనన్న లే అవుట్‌కి కేటాయించారు. 28 మందికి ఇళ్ల పట్టాలు అందించారు. గ్రామస్తులంతా ఇళ్ల నిర్మాణానికి గ్రామాన్ని ఆనుకుని ఉన్న స్థలం కేటాయించాలని కోరారు. గ్రామానికి దూరంగా లే అవుట్ ఉండడంతో ఇళ్లు నిర్మించలేదు. ఇటీవల లే అవుట్ స్థలంలో కొందరు గడ్డి పెంచుతూ ఆక్రమించారని గ్రామస్తులు ఆరోపించారు . దీనిపై తహసీల్దార్ లక్ష్మిని వివరణ కోరగా లే అవుట్ స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలు తొలగిస్తామన్నారు.

నాగమ్మ పేరంటాలను దర్శించుకున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి



వైఎస్సార్‌సీపీ నేతలతోబూడి ముత్యాలనాయుడు

చీడికాడ: మండలంలోని బైలపూడిలో గల నాగమ్మ పేరంటాల తీర్థ మహోత్సవం సందర్భంగా బుధవారం అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు. ప్రత్యేక అభిషేకాలు చేశారు.ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండలఅధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, ఈశ్వరరావు,దేవినాయుడు,తారకేశు తదితరులున్నారు.